క్లుప్తంగా

హోమియో వైద్యశాలలో కలెక్టర్ తనిఖీ



హోమియో వైద్యశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు : ఆల్కాట్‌తోటలోని నగరపాలక సంస్థ హోమియో వైద్యశాలను గురువారం కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి ఓపీ సేవలు, మందుల నిల్వలు, అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. డాక్టర్లు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణ ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు ఆసుపత్రిలో సిద్ధంగా ఉంచాలన్నారు.

నర్సరీని సందర్శించిన మాజీ మంత్రి పేర్ని నాని



బుర్రిలంక నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పేర్నినాని

కడియం: బుర్రిలంకలోని ఉమాపార్వతి నర్సరీని గురువారం మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) సందర్శించారు. నర్సరీ రైతులు కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి ఆయనకు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన నర్సరీలోని మొక్కలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

కొంతమూరు హైస్కూల్లో సరస్వతి విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జి.మేడపాడు గ్రామానికి చెందిన సుంకవల్లి ఆదిత్య భార్గవి ఏర్పాటుచేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని గురువారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణగౌడ్, సొసైటీ అధ్యక్షుడు అడ్డాల శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నున్న కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు హెల్మెట్ల పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని ఆయన అభిమాని పడాల శ్రీనివాసు ఆధ్వర్యంలో స్థానిక కంబాలచెరువు చిరంజీవి బస్టాండ్ వద్ద వేడుకలను గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, రాజానగరం బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి, జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీనివాసరావు పాల్గొన్నారు. అభిమానులు, ముఖ్య అతిథులు చేతుల మీదుగా కేకు కట్ చేసి స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. విద్యార్థులకు గొడుగులు, యువతకు హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లలితానగర్ ఫ్రెండ్ సర్కిల్ నామన వాసు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	పరదా
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	పరదా
స్వామి	:	కూలీ
అనుశ్రీ	:	కూలీ
శివజ్యోతి	:	బన్ బటర్ జామ్
రాజా	:	వార్–2
ఊర్వశి	:	కూలీ
మేనక	:	యూనివర్సిటీ
రంభ	:	స్టాలిన్
అప్సర	:	వార్–2
అశోక నామవరం	:	వార్–2
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	కూలీ
మురళీకృష్ణ కడియం	:	కూలీ, మహవతార్ నరసింహ
వెంకటసూర్య	:	కూలీ

డిజిటల్ చెల్లింపులు.. జేబుకు చిల్లు

- అదుపు తప్పుతున్న ఖర్చులు
- రూ.5 మొదలు రూ.వేలల్లో ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు
- తల్లకిందులవుతున్న ఫ్యామిలీ బడ్జెట్
- కోవిడ్ తరువాత అధికమైన డిజిటల్ చెల్లింపులు



డిజిటల్ పేమెంట్లు నమూనా చిత్రం

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి నగరానికి చెందిన శ్రీనివాస్ ఒక ప్రైవేటు కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. జీతం నెలకు రూ.50వేలు. ఈ మొత్తంలో ఇంట్లోని నలుగురు కుటుంబ సభ్యులతో కలసి హాయిగా జీవిస్తున్నాడు. ఇటీవల ఒక దుకాణంలో వస్తువులు కొని బిల్లు చెల్లించేందుకు అక్కడ ఉన్న స్కానర్‌ను క్లిక్‌చేసి డబ్బులు పంపిస్తే బ్యాంకు ఖాతాలో తగిన నగదు లేదని చూపించింది. దీంతో ఒక్కసారిగా అతనికి పరిస్థితి అర్థం కాలేదు. ఆ తర్వాత చెక్ చేసుకుంటే డిజిటల్ పేమెంట్ల ద్వారా తానే ఖాతాలో ఉన్న సొమ్ము మొత్తం ఖర్చు చేసినట్లు నిర్ధారించుకున్నాడు.

జిల్లాలో డిజిటల్ పేమెంట్లు విపరీతంగా పెరిగాయి. ఒకప్పుడు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం లాంటివి ఉపయోగించాలంటే భయపడేవారు. ఇప్పుడు అవలీలగా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎంతగా అంటే రూ.5నుంచి వేల రూపాయల వరకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్నారు. ఎంత ఖర్చు పెడుతున్నారో తెలియనంతగా వీటి వినియోగం పెరిగింది. చెల్లింపులు మొత్తం బ్యాంకు ఖాతా ద్వారానే జరుగుతోంది. అది చిన్న మొత్తమైనా, పెద్ద మొత్తమైనా అన్నీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించడంతో ఖర్చుల వివరాలు మొత్తం బ్యాంకు ఖాతాలో నిక్షిప్తమవుతున్నాయి.

లెక్కలేకుండా ఖర్చు

ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యేవరకు ఎంత ఖర్చు పెట్టామో తెలియని పరిస్థితి నేడు చాలామందిలో నెలకొంది. దీనికితోడు ఏ వస్తువును ఎంతకు కొనుగోలు చేస్తున్నారో కూడా తెలియకుండా, బేర మాడకుండా కొనేస్తున్నారు. గతంలో కొనుగోలుదారుడు కిరాణా దుకాణానికి వెళ్లే సరుకులకు బిల్లు వేస్తే ఏది ఎంత అయిందనే వివరాలు సరి చూసుకుని చేతి ద్వారా డబ్బులు చెల్లించే వారు. డిజిటల్ పేమెంట్ల కారణంగా కొనుగోలుదారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. షాపువారు ఎంత చెబితే అంత చెల్లించి వచ్చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్ల కారణంగా డబ్బు ఎలా వస్తుందో...ఎలా పోతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

చిల్లర కొరత తీరింది



మాది కూరగాయలు వ్యాపారం. రూ.10 నుంచి రూ.300 వరకు వివిధ రకాల కూరగాయలు విక్రయిస్తాం. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ ఎంతోమంది వస్తుంటారు.ఈక్రమంలో చిల్లర కొరత బాగా ఎదురయ్యేది. డిజిటల్ పేమెంట్లతో చిల్లర సమస్య తీరింది.

– రీసు సురేష్,కూరగాయలు వ్యాపారి, రాజమండ్రి

కోవిడ్ తర్వాత మార్పు

డిజిటల్ పేమెంట్ల రూపంలో పదేళ్ల కిందట డెబిట్, క్రెడిట్ కార్డులు, గిఫ్ట్ కార్డులు వచ్చాయి. కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి వాటిని వ్యాపార దుకాణాల్లో స్వాక్ చేసి డబ్బులు చెల్లించేవారు. కొంత కాలం తర్వాత ఇవే కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో వస్తువులను కొనుగోలు చేసే అవకాశం వచ్చింది. కోవిడ్ అనంతరం వ్యాపార లావాదేవీల్లో మరింత సరళతరం వచ్చింది. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్ ద్వారా జనం డబ్బు చెల్లించడం, తీసుకోవడం ప్రారంభించారు. వ్యాపారులు సైతం క్రమంగా అంగీకరించక తప్పని పరిస్థితి. చిల్లర కొరత కారణంగా కూడా డిజిటల్ పేమెంట్లు ఊపందుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో గురువార శ్రీ మహాలక్ష్మీ వ్రతం



శ్రీమహాలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

సీటీఆర్‌ఐ: భక్తుల కొంగుబంగారం శ్రీమహాలక్ష్మీ అమ్మవారి గురవార శ్రీమహాలక్ష్మి వ్రతం ఆచరించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని శ్రీమహాలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు అన్నారు. గాదాలలోని శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్నవేంకటేశ్వరస్వామి పీఠంలో గురువార శ్రీ మహాలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 20 గోత్రాలకు చెందిన దంపతులు హాజరై శాస్త్రోక్తంగా వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా చిన్నవెంకన్న బాబు మాట్లాడుతూ దేశంలోనే నక్షత్రాలు, రాసులతో అమ్మవారి వాహనమైన గుడ్లగూబతో నిర్మాణమైన ఆలయం ఇదే కావడం విశేషమన్నారు. అనుగ్రహ ప్రధా ఇంటర్నేషనల్ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్ తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల అభ్యున్నతికి సహాయం



కొరిమిల్లి కిరణ్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: మానవ హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని హ్యూమన్ రైట్స్ జిల్లా కన్వీనర్‌గా నియామకం పొందిన కొరిమిల్లి కిరణ్‌కుమార్ అన్నారు. మానవ హక్కుల, అవినీతి నిరోధక సంఘం జాతీయ అధ్యక్షుడు గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి, జాతీయ జనరల్ సెక్రటరీ దొడ్డా తిరుపతయ్య గురువారం కిరణ్‌కుమార్ నియామకంపై ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో పేద వర్గాల అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కన్వీనర్‌గా నియమితులైన కిరణ్‌కుమార్‌ను తూర్పుగోదావరి జిల్లా హ్యూమన్ రైట్స్ చైర్మన్ తుపాకుల వెంకన్న బాబు, వైస్ చైర్మన్ పిల్లి కాంతారావు తదితరులు అభినందించారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు

రాజానగరం: దివాన్‌చెరువులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను గురువారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకర వెంకటేశ్వర్రావు తన సోదరుడు నాగేశ్వర్రావు జ్ఞాపకార్థంగా రూ.10 వేలతో వీటిని తయారు చేయించి, విద్యార్థులకు అందజేశారని హెచ్‌ఎం శర్మ, స్కూల్ కమిటీ చైర్మన్ బెజవాడ శ్రీను తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

రాజానగరం: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో జరిగిన అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్టు ఎంపీడీఓ జెఏ ఝాన్సీ తెలిపారు. ఎస్‌ఆర్‌పీ సూర్యచక్రం ఆధ్వర్యంలో నియమించిన ప్రత్యేక బృందం ప్రస్తుతం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఈ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తుంది. ఈ పరిశీలన పూర్తయిన తరువాత రెండు రోజులలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి గ్రామాల వారీగా ఆడిట్ చేసి, ఫైనల్‌గా మండల స్థాయిలో ఆడిట్ చేస్తారన్నారు.

నేడు వైద్య శిబిరం

రంగంపేట: దొడ్డిగుంటలో శుక్రవారం ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు స్థానిక స్మైల్ ఫౌండేషన్ అధినేత కొండేపూడి ధనరాజ్ తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, సుగర్, గుండె, ఎముకలు, దంత, కంటి, వైద్య పరీక్షలతోపాటు మహిళలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

తెలుగు వర్ణమాలకు దైవ శక్తి అనుసంధానం



నన్నయ విగ్రహాలకి పూలమాలేసి నివాళులర్పిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్‌ఐ: తెలుగు పలుకులోని వర్ణమాల అంతర్నిర్మాణం వాగ్దేవతలకు అనుసంధానమై ఉందని కాలభైరవ గురుసంస్థాన అధిపతి శివస్వామి అన్నారు. తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి, సంహిత డిగ్రీ కళాశాల నిర్వహణలో గురువారం తెలుగు మాటల పండుగలో భాగంగా మొదటిరోజు అక్షర దేవతల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆనం కళా కేంద్రంలోని నన్నయ్య విగ్రహం నుంచి రాజరాజ నరేంద్రుని విగ్రహం వరకు అక్షర దేవతల చిత్రాలతో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివస్వామి మాట్లాడుతూ తెలుగులో ప్రతి అక్షరానికి ఒక రూపం, దేవత శక్తి ఉంటుందని తెలిపారు. తెలుగువారంతా అక్షరాలకు, శబ్దానికి గల గౌరవాన్ని గుర్తెరిగి మాట్లాడాలని ప్రధాన వక్త డాక్టర్ జయప్రద సూచించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గాయత్రి మంత్రంలోని 24 బీజాక్షరాలు ఎలా శక్తిని కలిగి ఉంటాయో అలాగే వర్ణమాలలోని ప్రతి అక్షరం ఒక అధిష్టాన దేవతకు అనుసంధానమై ఉంటుందని ఆమె తెలిపారు. డాక్టర్ పీవీబీ సంజీవరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, పీవీఎస్ కృష్ణారావు, సన్నిధానం శాస్త్రి, దేశ రెడ్డి బలరామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కులు కాపాడేందుకు నిరంతర కృషి



ఖండవల్లి లక్ష్మిని సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

సీటీఆర్‌ఐ: మానవహక్కుల సంఘం పేరుతో ఎవరైనా బ్లాక్ మెయిల్ చేసినా, ప్రలోభాలకు గురి చేసినా ఫిర్యాదు చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ తాళ్ళూరి ప్రసన్న కుమార్ అన్నారు. సంస్థ తరుపున స్థానిక ఆనం రోటరీ హాలులో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. తమ సంఘం 9 ఏళ్లుగా మానవహక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. మానవహక్కులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ప్రసన్నకుమార్ చెప్పారు. మానవ హక్కుల పేరుతో పుట్టగొడుగుల్లా కొన్ని సంస్థలు పుట్టుకొచ్చాయని ఆయన విమర్శించారు. మానవ హక్కుల సంఘం పేరుతో బెదిరింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి మాట్లాడుతూ మానవహక్కులను కాపాడేందుకు బాధితుల పక్షాన పోరాడుతున్నారన్నారు. ఖండవల్లి లక్ష్మి సేవలకు గుర్తింపుగా ఆమెను హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డు అందజేసి సత్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీనివాసరావు, వైవీ జగన్నాథ రావు, డాక్టర్ గిరిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



కడియం దేవీచౌక్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కడియం: అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు వేతనాలు పెంచడంతో పాటు, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని జిల్లా అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బేబీ రాణి డిమాండ్ చేశారు. గురువారం కడియం దేవీచౌక్ సెంటర్‌లో తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ గతేడాది జూలైలో జీతాలు పెంచుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఆ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు వై.సుజాత, ఏడుకొండలు, పి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఐపీఎల్‌తో నేక్ అవగాహన ఒప్పందం

- జిల్లాలో నైపుణ్య శిక్షణ తరగతులు
- నేక్ ఏడీ జే.రాజు



నేక్ సహాయ సంచాలకులు రాజు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రస్థాయిలో ష్వింగ్ స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఎస్ఐపీఎల్)తో అవగాహన ఒప్పందం నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో నైపుణ్య శిక్షణ తరగతులు త్వరలో ప్రారంభం కానున్నాయని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) సహాయ సంచాలకులు జె.రాజు గురువారం తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ (నేక్) ద్వారా, నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన ష్వింగ్ స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదిరిందని ఆయన వివరించారు. ఈ ఒప్పందం ప్రకారం ఎన్ఎస్‌డీసీ ఆమోదిత ఉద్యోగ పాత్రల ఆధారంగా శిక్షణ కార్యక్రమాలు, తరగతి గదులలో సిద్ధాంత బోధనతో పాటు ప్రాజెక్ట్ సైట్లలో ప్రాక్టికల్ శిక్షణ, అత్యాధునిక పరికరాలు, భద్రతా కిట్లు, రవాణా సౌకర్యం అందిస్తామని పేర్కొన్నారు. అదనంగా, స్థానిక శిక్షకుల కోసం ట్రెనింగ్ ఆఫ్ ట్రైనర్స్(టీవోటీ) కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా నిపుణులైన యంత్రాల ఆపరేటర్లు, సాంకేతిక నిపుణులుగా యువతను తీర్చిదిద్దడం లక్ష్యమని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రాజు తెలిపారు. పరిశ్రమల అనుసంధానంతో ఉపాధి పెంపుతో పాటు రాష్ట్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధి కొత్త దిశలో సాగుతుందని జె.రాజు స్పష్టం చేశారు.

వినాయక చవితి మంటపాలకు అనుమతి తప్పనిసరి



కడియం మండలంలో ఆటోతో ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

కడియం: వినాయక చవితి సందర్భంగా ఈనెల 27న గ్రామాల్లో నెలకొల్పే వినాయక విగ్రహాల మంటపాల ఏర్పాటుకు ఆయా ఉత్సవ కమిటీలు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కడియం పీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కడియం మండలంలో గ్రామాల్లో ఆటో ద్వారా ఉత్సవ కమిటీలు పాటించాల్సిన నిబంధనలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మట్టి వినాయకుడితో, కాలుష్య రహిత చవితి ఉత్సవాలను జరుపుకోవాలని, మండపాల వద్ద తగిన భద్రత ప్రమాణాలు పాటిస్తూ, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు, నిమజ్జన సమయంలో విద్యుత్ శాఖ పోలీసుల శాఖ సహకారం తీసుకోవాలన్నారు. ఇష్టానుసారంగా డీజేలు, అసభ్యకర నృత్యాలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశువులకు వైద్య పరీక్షలు

బిక్కవోలు: గ్రామంలోని ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ తేతలి సుమ ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ శిబిరంలో మండపేట రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేష్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీపీ మనోజ్ కుమార్, మండపేట పశువైద్యులు, రాజమహేంద్రవరం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాక్కాన వెంకటేశ్వరరావు, అనపర్తి ఏడీ డాక్టర్ వై.శ్రీనివాసరావు సేవలు అందించారు. 55 పశువులు గర్భకోశ వ్యాధి చికిత్సలు, గర్భనిర్ధారణ, ఇతరు వ్యాధులకు చికిత్సలు అందించారు. పాడి రైతులు ఖనిజ లవణా మిశ్రమం అందించారు. ఈ కార్యక్రమంలోని మండల పశువైద్యలు తిరుమలరావు, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్ చౌదరి, తొస్సిపూడి మాజీ ఉపసర్పంచి తేతలి సూర్యచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్రామోరల్ క్రీడా పోటీలు ప్రారంభం



పందలపాకలో టాస్ వేసి క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న సత్తిరాజు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీపడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025–26 సంవత్సరానికి ప్రారంభ ఇంట్రా మోరల్ క్రీడ పోటీలు ప్రారంభించారు. గురువారం పాఠశాల వద్ద ముందుగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తి రాజు కబడ్డీ క్రీడలు టాస్క్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలహెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాల ప్రారంభ సమయంలో విద్యార్థులను హౌస్‌లుగా విభజించి గ్రూపుల మధ్య ఇంట్రా మోరల్ క్రీడలు కబడ్డీ, వాలీబాల్, కోకో, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ క్రీడలు విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి మానసిక ఉల్లాసాన్ని కలగజేయడానికి ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ నెల 29 క్రీడా దినోత్సవం రోజున ఇంట్రామోరల్స్ విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోని పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ఉగ్రరూపం

గోదావరి ఉగ్రరూపంలో ఉరకలేస్తోంది. కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి క్రమక్రమంగా పెరుగుతోంది. గోదావరికి భారీగా వరద నీరు పోటెత్తడంతో గురువారం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ముందుస్తు చర్యలుగా నదీ పరివాహక ప్రాంతంలోని మూడు లంకల్లో ఉన్న కుటుంబాలకు చెందిన వారిని అధికారులు సురక్షితంగా పునరావాస కేంద్రానికి తరలించారు. రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు, పుష్కరాల రేవు హేవ్‌లాక్ బ్రిడ్జి వద్ద నిత్యహారతి ప్రదేశం వద్ద వరద పోటెత్తింది. కేతావారి లంక, వెదుర్లంక, బ్రిడ్జి లంకలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

– రాజమహేంద్రవరం సిటీ



పుష్కరాల రేవులోని హేవ్‌లాక్ బ్రిడ్జి వద్ద 53 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం



కోటిలింగాల రేవు వద్ద గోదావరి వరద



పుష్కరాల రేవు నిత్యహారతి ప్రదేశం వద్ద పోటెత్తిన వరద



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద వరద ఉధృతి



బ్రిడ్జిలంక మత్స్యకార కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు